క్లుప్తంగా

ఆదిత్యునికి అభిషేకాలు


సుజాతనగర్‌లోని సూర్యనారాయణస్వామి

పెందుర్తి: సుజాత నగర్‌లోని సూర్య నారాయణ స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువ జామున స్వామి వారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శిథిల మురుగు కాలువతో అవస్థలు


విస్సన్నపేటలో శిథిలావస్థకు చేరిన మురుగు కాలువ

పరవాడ: వాడచీపురుపల్లి శివారు విస్సన్నపేటలో మురుగు కాలువల పరిస్థితి అధ్వానంగా మారడంతో ప్రజలు నానా ఇబ్బందులుపడుతున్నారు. పదేళ్ల క్రితం నిర్మించిన మురుగు కాలువలు దాదాపు శిథిల స్థితికి చేరాయి. కాలువ గట్లు ఎక్కడికక్కడ ధ్వంసమయ్యాయి. పూడికలు పేరుకుపోయి మురుగు ప్రవాహానికి వీల్లేకుండా ఉన్నాయి. దీంతో మురుగు నీరు నిలిచిపోయి దోమల వ్యాప్తి, దుర్వాసనతో రాత్రీపగలూ నరకయాతన అనుభవిస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధ్వానంగా మారిన డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకురాలు కూండ్రపు ఉమ, స్థానికులు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా కాలభైరవ విగ్రహ ప్రతిష్ట


విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, భక్తులు

పెందుర్తి: మండలంలోని పెదగాడిలో నూతనంగా నిర్మించిన కాల భైరవ స్వామి దేవాలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్టాపన ఆదివారం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రముఖ కాలభైరవ ఉపాసకుడు విశ్వసాయి గురూజీ ఆధ్వర్యంలో సంకట హర గణపతి, లక్ష్మీ కుబేర సహిత స్వర్ణాకర్షణ మహా కాలభైరవ, మానసదేవి, స్ఫటిక శివలింగేశ్వరుడు, భైరవీమాత విగ్రహాలను ప్రతిష్టించారు. అనంతరం దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. సర్పంచ్ కేసుబోయిన లావణ్య, కార్పొరేటర్ ముమ్మన దేముడు, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, స్థానిక నేత కేసుబోయిన త్రినాథ్, అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ప్రతినిధులు

పెందుర్తి: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పెందుర్తి మండలం అక్కిరెడ్డిపాలెం తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం విస్తృత ప్రచారం చేశారు. సమితి ప్రతినిధులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కె.త్రినాథరావు, వి.సురేష్, బి.అప్పలనాయుడు, ఆదెమ్మ, లక్ష్మి, రాజు, భవాని తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో ఆరుగురు 'షైనింగ్ స్టార్'లు

సబ్బవరం: మండలంలోని పలు పాఠశాలల్లో టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపికైనట్లు ఎంఈవో రవీంద్రబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన జి కీర్తి, ఆర్కిడ్ ఈఎం స్కూల్ నుంచి సురేష్ కుమార్, ప్రతిభ విద్యాలయం గల్లా గీతాచంద్రిక, గొర్లి యజ్ఞశ్రీ, వంక గ్రీష్మంత్ చరణ్, ఆరిపాక సూర్యప్రకాష్ పాఠశాలకు చెందిన ఎస్.భార్గవరెడ్డి ఉన్నారని పేర్కొన్నారు. విద్యారంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఈ షైనింగ్ స్టార్ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

కూటమి ప్రభుత్వంలో.. ఆక్రమణల పర్వం

'ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఏ పార్టీ వారైనా ఉపేక్షించబోం. ఆ భూములను కాపాడాల్సిన బాధ్యత మాకు ఎంతో ఉంది. వాటిని ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేస్తాం. తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు భూ కబ్జాలపై కఠినంగా వ్యవహరించాలి'.. ఏడాదిగా దాదాపు ప్రతి సందర్భంలోనూ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు నోటి నుంచి వస్తున్న బహిరంగ నీతి వాక్యాలివి. కానీ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఆక్రమణలే. మరీ ముఖ్యంగా పెందుర్తి పట్టణ ప్రాంతంలో కబ్జాలు మరింత ఎక్కువ. ఎమ్మెల్యే ఇంతగా చెప్తున్నా.. అంతగా ఎందుకు కబ్జాలు జరుగుతున్నాయో.. లోగుట్టు పెరుమాళ్లకే ఎరుక!


డెబ్రిస్‌తో కార్మికనగర్ చెరువును పూడ్చుతున్న వైనం

- ప్రభుత్వ స్థలాలు, చెరువుల్లో కూటమి నాయకుల దురాక్రమణ
- షెడ్‌లు, పాకలు వేసి విక్రయిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు
- 97వ వార్డు కార్మికనగర్‌లో చెరువును మాయం చేస్తున్న టీడీపీ నాయకులు
- 88వ వార్డు నరవలో రూ.కోట్లు విలువ చేసే గెడ్డ స్థలంలో నిర్మాణాలు

పెందుర్తి: కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ స్థలాలు, చెరువులు, గెడ్డలు, కొండలు, గుట్టల ఆక్రమణలు దారుణంగా పెరిగాయి. అధికారం చేపట్టిన తొలినాళ్లలో ఇటు జనసేన, అటు టీడీపీ నాయకులు చిన్నపాటి ప్రభుత్వ భూములను ఆక్రమించుకునేవారు. ప్రస్తుతం అధికార కూటమి పరివారం చేస్తున్న కబ్జాలు విశ్వరూపం దాల్చాయి. రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలతో పాటు ఏకంగా చెరువులు, గెడ్డలను అమాంతం మింగేస్తున్నారు. ప్లాట్లుగా విభజించి, చిన్న చిన్న షెడ్లు వేసి అమ్మకాలు జరిపి, సొమ్ము చేసుకుంటున్నారు. తెరమీద టీడీపీ, జనసేన క్షేత్రస్థాయి నాయకులే కనిపిస్తున్నారు. వీరికి సంపూర్ణ సహకారం అందిస్తున్న ప్రజాప్రతినిధులకు, వారి 'కలెక్షన్‌'ఏజెంట్లకు సంతృప్తికరమైన వాటాలు అందుతున్నాయన్న విమర్శలున్నాయి.


కార్మికనగర్ చెరువులో హెచ్చరిక బోర్డును ఆనుకుని నిర్మించిన షెడ్


కార్మికనగర్ చెరువులో అమ్మకానికి సిద్ధంగా టీడీపీ నాయకులు వేసిన షెడ్లు

అధికారం అండగా.. దర్జాగా కబ్జా

చినముషిడివాడ కార్మికనగర్లో కబ్జా డాన్‌లుగా ముద్ర పడిన ముగ్గురు స్థానిక టీడీపీ నాయకులు ఇక్కడి సర్వే నెంబర్ 163ని పూర్తిగా గుప్పెట్లో పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వ పెద్దల సామాజికవర్గానికి చెందిన ఓ వ్యక్తి, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ బంధువుగా చెప్పుకుంటున్న మరో వ్యక్తి, వారికి సహకారం అందిస్తున్న ఇంకొకరు కలిసి చెరువును పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. కొంచెం కొంచెం మట్టితో కప్పి, షెడ్‌లు నిర్మించడమే వీరి దిన చర్య. అలా బహిరంగంగా దురాక్రమణ చేసి అమ్మకాలు జరిపిన సొమ్ములో వాటాలను స్థానిక ప్రజాప్రతినిధులకు అందించడంతో వారు అధికారులు నోళ్లు, కళ్లు మూయిస్తున్నారని సమాచారం. ఇక్కడ జరుగుతున్న కబ్జాలపై ఎన్ని ఫిర్యాదులు చేసినా జిల్లా స్థాయి అధికారులు కూడా వారు నిర్మించిన షెడ్‌లో ఒక్క రేకును కూడా తొలగించలేని స్థితి.

నరవలో గెడ్డ ఆక్రమణ

జీవీఎంసీ 88వ వార్డు నరవలోనూ కూటమి నాయకుల కబ్జాలు దారుణంగా పెరిగాయి. ఇప్పటికే నరవ ప్రాంతంలో అక్రమ మైనింగ్‌తో ప్రకృతి సంపదను దోచుకుంటున్న టీడీపీ, జనసేన నాయకులు తాజాగా గెడ్డలపై పడ్డారు. ఇక్కడి సర్వే నెంబర్ 36 గెడ్డ వాగులో సుమారు రూ.7–8 కోట్లు విలువైన దాదాపు 90 సెంట్ల స్థలాన్ని కూటమి నాయకులు ఆక్రమించుకున్నారు. అందులో లేఅవుట్ వేసి మరీ అమ్మకాలు జరిపారు. ప్రస్తుతం ఆ స్థలాల్లో దర్జాగా నిర్మాణాలు మొదలెట్టారు. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా వారు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ భూ దందాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.


జీవీఎంసీ 88వ వార్డు నరవలో గెడ్డను ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న టీడీపీ నాయకుడు

కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు



ప్రభుత్వ స్థలాల సంరక్షణే మా బాధ్యత. ప్రభుత్వ స్థలంలో ఎవరు నిర్మాణం చేపట్టినా కూల్చేస్తాం. ఇక అమ్మకాల సంగతి మా దృష్టికి రాలేదు. ఎవరైనా బాధితులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే దానిపై విచారణ జరిపి, చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాలు కొనుగోలుచేస్తే నష్టపోవడం తప్ప ఇంకేం ప్రయోజనం ఉండదు.

– ఎం.ఆనంద్‌కుమార్, తహసీల్దార్, పెందుర్తి

ఆర్వో ప్లాంట్ మూతపడి.. తాగునీటికి ఇక్కట్లు


ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురవడంతో గేటుకు తాళం వేసిన దృశ్యం

పరవాడ: మండలంలోని వెన్నెలపాలెం గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చాల్సిన ఆర్వో ప్లాంట్ మూలకు చేరింది. దీంతో గత 20 రోజులుగా ప్రజలు తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అసలే వేసవి కాలం. చాలా చోట్ల చేతి పంపులు చుక్క నీరిచ్చే పరిస్థితి లేదు. ఈ సమయంలో ఆర్వో ప్లాంట్ పాడవడంతో స్థానికులు నానా యాతన పడుతున్నారు.

సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు రూ.12 లక్షలు వెచ్చించి, 2014లో ఈ ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. ఇటీవల ఇది మరమ్మతులకు గురైంది. ప్లాంట్ స్టోరేజ్ ట్యాంక్‌కు రంధ్రం ఏర్పడింది. ప్లాంటులో అమర్చిన రెండు మోటార్లు కాలిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. మూడు కిలోమీటర్ల దూరంలోని పరవాడ, గొర్లివానిపాలెం గ్రామాల్లో ఉన్న ఆర్వో ప్లాంట్లపై ఆధారపడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదన్నారు. ప్రజల తాగునీటి కష్టాలను గుర్తించి ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షణ్ముఖ వద్ద 'సాక్షి' ప్రస్తావించగా ప్రజల నుంచి అందిన ఫిర్యాదు మేరకు మెకానిక్‌ను పంపి సమస్యను గుర్తించామన్నారు. అవసరమైన నిధులను గ్రామ పంచాయతీ సమకూర్చిన వెంటనే మరమ్మతులు చేపడతామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తుప్పలతో తిప్పలు


తుప్పల మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పరవాడ: కలపాక గ్రామంలో విద్యుత్ వినియోగదారుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తుప్పల మధ్య చిక్కుకుపోయింది. గ్రామంలో విద్యుత్ పరమైన సమస్యలు తలెత్తినప్పుడు విద్యుత్‌ను నిలుపుదల చేయాలంటే తుప్పల మధ్య నుంచి వెళ్లలేక సిబ్బంది నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ దట్టంగా పెరిగిన ముళ్ల కంచె, వివిధ రకాల అల్లిక తీగలు దాటుకుని వెళ్లాలంటే భయపడే పరిస్థితి. ఫీజు బాక్స్ చుట్టూ ఏర్పాటుచేసిన ఐరన్ బాక్స్ కూడా తుప్పు పట్టి పాడైంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద దట్టంగా పెరిగిన తుప్పలను తొలగించేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు వేడుకుంటున్నారు.

నేడు పైడితల్లి తొలేళ్లు


పైడితల్లి అమ్మవారు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి తొలేళ్ల పండగ సోమవారం జరగనుంది. రాత్రి గ్రామంలో ఘటాల ఊరేగింపు ఘనంగా జరపనున్నారు. అమ్మవారి పూజారి వంశస్తుల ఆధ్వర్యంలో రాత్రి గంట దీపాల ఉత్సవాన్ని నిర్వహిస్తారు. తొలేళ్లను పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో మార్కెట్‌లోని పుష్కరిణి సత్రం వద్ద రాత్రి 7 గంటల నుంచి నృత్యప్రదర్శనలు ఏర్పాటు చేశారు. పెందుర్తికి చెందిన నిర్మలా నృత్యనికేతన్, గాజువాకకు చెందిన నాట్యారాధన సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి మారువారం పండగ


సత్తెమ్మను దర్శించుకుంటున్న గంట్ల శ్రీనుబాబు

సింహాచలం: అడవివరం గ్రామ పొలిమేర దేవత, శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి సత్తెమ్మతల్లి మారువారం పండగ ఆదివారం ఘనంగా జరిగింది. సమీప ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారికి చీరలు, పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పండగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకటరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

సముద్రాలను సంరక్షించుకోవాలి



బీచ్ క్లీనింగ్‌లో పాల్గొన్న ఏయూ వీసీ రాజశేఖర్, పలు సంస్థల సిబ్బంది


తీరంలో వ్యర్థాలను సేకరిస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు

ఏయూక్యాంపస్: భావితరాల కోసం సముద్రాలను పరిరక్షించాలని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ప్రపంచ సముద్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం సాగర తీరాన్ని శుభ్రం చేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ స్వయంగా బీచ్ రోడ్డు తీరంలోని వ్యర్థాలను సేకరించారు. దశాబ్ద కాలంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సముద్రాలు సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. మొత్తం 135 కిలోల వ్యర్థాలను సేకరించి జీవీఎంసీకి అందజేశారు. కార్యక్రమంలో సీఎంఎఫ్ఆర్ఐ, సీఐఎఫ్‌టీ, ఎన్‌సీసీఆర్, ఎస్ఎస్‌టీఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థల సిబ్బంది, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, జువాలజీ విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.



సింహగిరిపై విశేషంగా నృసింహ హోమం


కుంభ ప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో తదితరులు

సింహాచలం: సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం సింహగిరిపై శ్రీ నరసింహ హోమం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ఉత్తరరాజగోపురం ఎదురుగా ఉన్న విశాల ప్రాంగణంలో ఈ హోమాన్ని నిర్వహించారు. హోమంలో 22 మంది ఉభయదాతలు ప్రత్యక్షంగా, 87 మంది ఉభయదాతలు పరోక్షంగా పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందారు. ఉత్తరరాజగోపురం ఎదురుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారీ వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులైన గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. హోమగుండం వద్ద విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలతో స్వామివారి అష్టోత్తర శతనామావళిని పఠింపజేశారు. అనంతరం కుంభ ప్రోక్షణ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, విజయనగరం ఆర్డీవో ఎస్. శ్రీనివాసమూర్తి, ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్, స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, అర్చకులు గిరి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు దీక్షల్లో భెల్ ఉద్యోగులు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన 1532వ రోజు రిలేదీక్షల్లో ఆదివారం భెల్ సీఐటీయూ నాయకులతో పాటు విశాఖ డెయిరీ ఉద్యోగులు పాల్గొన్నారు. సీఐటీయూ ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ కార్మికులు ప్రజల పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ అమలు చేసిందన్నారు. ఈ ప్యాకేజీ వల్ల ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం లేకపోగా నిరాశే మిగిల్చిందన్నారు.

చేప చిక్కె.. భృతి దక్కె

సముద్రంలో చేపల వేట నిషేధంతో చెరువు, డ్యాం చేపలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. పిత్త పరిగలు, బొమ్మిడాయిలు, పాల గొరసలు, కొరమీను, బొంతలు, బొచ్చె, శీలావతి, బంగారుపాప, చందువా.. ఇలా అన్నిరకాల చేపలకు గిరాకీ బాగుంది. దీంతో పెందుర్తి గ్రామీణ ప్రాంతంలోని చెరువుల్లో చేపల పెంపకందారులు వారంతంలో చేపల వేటను ముమ్మరం చేశారు. చేపలు పట్టే కూలీలకు నిత్యం ఉపాధి లభిస్తోంది. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ సమీప గ్రామాలైన జెర్రిపోతులపాలెం, చింతగట్ల, చింతలగ్రహారం ప్రాంతాల్లో చేపల విక్రయాల దుకాణాలు రద్దీగా మారాయి. మత్స్య సంపద తగినంత ఉండడం, చేపలు విరివిగా లభించడంతో సముద్రం చేపలు లేకపోయినా.. ఎప్పటిలాగే వ్యాపారులు ప్రజలకు అందుబాటులో ఉండే ధరలకే వాటిని విక్రయిస్తున్నారు. పనిలో పనిగా చేపలు కటింగ్‌చేసే వారికి రోజంతా పని ఉంటోంది. దీంతో పెంపకందారులు, వ్యాపారులు, కూలీలు అందరూ నాలుగు రాళ్లు వెనకేసుకుంటున్నారు. – పెందుర్తి


రాంపురం వద్ద ఓ చెరువులో చేపలు పడుతున్న పెంపకందారులు


మేహాద్రి వద్ద చేపలను కట్ చేస్తున్న వ్యక్తి